# పజిల్స్

రామమోహన్

●

అయితే ఇంటివద్దవున్న నాలుగుఘడియలైనా, పెళ్లాం, పిల్లలూ అని చూడ్డం యేమయినావుందా లేదా? ఎప్పుడూ ఆ పజిల్సు పూర్తిచేయడంతోనే సరిపోతోంది. నాప్రాణానికి ఆ శబ్దరత్నాకరం ఒకటి యెక్కడ దాపరించిందోకాని...! ఎక్కడ దొరికిందండీ!!"

"దొరకడం యేమిటే నీమొహం, అయిదు రూపాయలుపెట్టి కొంటేను"

"మహాగొప్ప పనిచేసారు. అదేమిటోకాని వూరూ వాడాక్కడాక్కడా పజిలు కంపెనీలు బయలుదేరాయి. వాళ్లు మీలాంటి పిచ్చిపుల్లాయ లందరి దగ్గరా డబ్బుగుంజుకొని, పెద్దమొత్తాలన్నీ ఏ యెల్లయ్యకో, వెంకయ్యకో వచ్చిందని రాసేయటం, పావలా, అర్ధా బహుమతులన్నీ మీలాంటివాళ్లకి భారీగా పంచిపెట్టడం దాంతో మీరు తబ్బిబ్బు అయిపోవటం, మహాబాగుందికదండీ!"

"అలాగనకు కమలం, నిజంగా నువ్వన్నట్లు వాళ్లు డబ్బు దోచేస్తూంటే, యీపత్రికలవాళ్లు వూరుకుంటారంటావా?"

"ఊరుకోక యేమిచేస్తారు. ఏమయినాఅంటే వారికిచ్చే అడ్వర్‌టయిజుమెంట్సు రావేమోనని వాళ్ళ భయం."

"మహాబాగున్నాయికదూ, నువ్వనేమాటలు. మనం రయితుగావ్రాస్తే మనకుమాత్రం యివ్వరా యేమిటి ఆ ఫస్టుప్రయిజు."

"ఇవ్వకేం యిస్తారు. ఇప్పటికి మీరు తగలేసిన వందరూపాయలకూ మీకువచ్చిన ప్రతిఫలం యేమిటో చెప్పండురూ! పదిరూపాయలేనా! యింకేమయినా వుందా?"

"కమలం నేచెప్పిన మాటవిను. ఇదే ఆఖరు పర్యాయం. దీనితోసరి. ఇది కనక రాకపోతే యింకెప్పుడూ పజిల్సు పంపదలంచుకోలేదు. దీనికి కూడా నువ్వే డబ్బివ్వాలి. మనకి ఫస్టుప్రయిజు తప్పదు."

"మీయిష్టం. నేచెప్తే వినేదేమయినా వుంది కనకనా! నాదగ్గరవున్నది, కాస్తా యింతకమునుపే వూడ్చేసారాయె. ఇంకవున్నది యీగాజుల జత ఒకటీని, అదికాస్తాకూడా పట్టుకువెళ్లి అమ్ముకోండి. అంతకన్న చేసేదేమిటి."

"నువ్వేం కష్టపెట్టుకోనఖరలేదు. మనకి ఫస్టుప్రయిజు వస్తుంది తప్పక. నువ్విచ్చిన వంద రూపాయలూ నీకిచ్చేసి, యీలాంటివి మరొక నాలుగు జతలు గాజులు చేయించకపోతే నన్నీపేరు పెట్టి పిలవకు"

"అయితే యింతకీ యీమారు మీరు పంపే కాపనులు యెన్నేమిటి"

"ఎన్నోయేమిటి, నూరుకాపనులేకదూ! ఈ దెబ్బతో మనకి ఫస్టుప్రయిజు రావటమేకాకుండా, యెక్కువకాపనులు పంపినందుకు, యేవుంగరమో, మెడలో, మెరిట్ ప్రయిజుకూడా రావచ్చును"

"మనకి ఫస్టుప్రయిజు వస్తుందని మాత్రం మీరేమి నిఖరుగా చెప్పగలరు"

"నేను యెంత శ్రమపడి యివి పూర్తిచేసానో నీకేం తెలుసు"

"నాకు తెలియకపోవటమేమిటి, మరొక రెండు నెలలుపోతే మిమ్మల్ని తప్పక విశాఖపట్టణం పంపాల్సొస్తుంది."

"మొన్న సాముద్రిక శిరోమణిరావు యేం చెప్పేడో తెలుసా? నాచెయ్యిచూచి! ఈనెలలో ఒక పెద్దయోగం వుందని చెప్పేడు"

"వారికే మాత్రం సమర్పించారేమిటి?"

"ఎంతోనా! ప్రశ్నకి ఒక్కరూపాయేకదూ ఇంతే అనుకున్నావేమో, మన సిద్ధాంతిగారు కనబడి

"అబ్బాయీ! నీకు అఖండరాజయోగం వుందోయ్" అన్నారు. ఇవి యిల్లావుంచు, నిన్న ఉదయం మన యింటికి వచ్చిన బుడబుడక్కల సాహెబు యేమన్నాడు చెప్పు?" అయ్యగారు చాలా శ్రమపడుతున్నారు, లాభంలేకుండాపోతోంది. ఈ నెల్లో తప్పక ఫలిస్తాయి అమ్మగారి శ్రమలు అమ్మగారికి నగలువస్తాయి అని చెప్పాడా లేదా?"

"మీరు, మీసిద్ధాంతాలు, చాలాబాగున్నాయి కదా! మీయిష్టంవచ్చినట్లు చేసుకోండి. అవేమీ నాకు తెలియవు.

* * *

"కమలం, కమలం, ఒక్కసారి యిల్లాత్వరగా రావాలి"

"అంత అర్జంటు పనేమిటో చెప్పండి"

"నామాటలు కాస్త వినవే కమలం"

"వినడానికే కదటండి యిక్కడకు వచ్చింది"

"అయితే చెప్తావిను, క్రిందటినెలలో మనం పంపించిన పజిల్సుకి సీలు ఆన్సరువచ్చింది"

"అయితే మీకు ఫష్టుప్రయిజు వచ్చిందా?"

"ఇంకా పేర్లు ప్రచురించలేదు. వచ్చేవారం ప్రచురిస్తారు. మన చిన్నమ్మాయి పేరుతో పంపించినది అక్షరానికి అక్షరం తుచ తప్పకుండా టస్సాగా వాళ్ళసీలు ఆన్సరుతో సరిపోయింది, ఇంక ఫష్టుప్రయిజు యెవరిదంటావు."

"అప్పుడే మురిసిపోకండి, ఆపేర్లుకూడా ప్రచురించనియ్యండి. అందులో మనపేరు చూచి తరువాత సంతోషిద్దాం"

"తెలియటంలేదూ! యింకా పేర్లు ప్రచురించటంకూడా యెందుకు, నువకంసాలిని యివ్వాళే రమ్మంటాను నీకు గాజులజతలు పురమాయించుదాం"

"నాగాజుల జతలకు యిప్పుడేం తొందరలేదు అసలు అదే పూర్తిగా తేమలనీయండి!

"ఏమండీ! యేమిటలా చూస్తున్నారు ఆ పేపరులో"

"బహుమతులు పొందినవారి లిస్టువచ్చింది చూస్తున్నా"

"అందులో మీ పేరుందా?"

"దానికోసమేగా చూస్తోంటా!"

"అందుకనే, మీరు ముందుగా గాజులు చేయిస్తానంటే వద్దన్నా. అదేదో పూర్తిగావచ్చేవరకూనూ! ఇంక దీనితో వూరుకోండి. పోయినదేదో పోనేపోయింది. ఇప్పటికిఅయిన శాస్తేచాలు."

"నేను వూరుకుంటాననుకున్నావా? వాళ్లు యిందుతో ఒకఫారం పంపారు. అదిపూర్తిచేసి స్క్రూటినీఫీజు అయిదురూపాయలు పంపితే మన కాగితాలు తిరిగి పరీక్షచేసి మనక్లెయిము కనక రైటు అయినదైతే, మనకి రావలసిన బహుమతీ, యీ రూపాయలుకూడా కలిపియిచ్చేస్తారు"

"లేకపోతే దాంతోపాటు యిదీ పోతుందన్నమాటేనా" ఇంక యీపజిల్సు వ్యాపారం కట్టిపెట్టి ఈపడేశ్రమ మరోదానికి వుపయోగిస్తే పదిరూపాయలు సంపాదించుకోవచ్చు సులభంగా, విన్నారా?"

---

న్యూథియేటర్సు వారి 'వాపసు' చిత్రం 3-12-43 తేదిని బొంబాయి క్రిష్ణా టాకీస్‌లో విడుదల అయింది- ఢిల్లీలో విడుదలను నిరీక్షిస్తున్నది- ఈ చిత్రంలోని కథావిధానమే సత్యమైనది. భారతీదేవి, అషిత్‌బరన్ అభినయించి వున్నారు- ఇది హృదయాన్ని నవరసభరితం చేస్తుంది- సుధిన్‌మజుందార్ ఫొటోగ్రఫీ, శ్యామసుందరఘోష్ రికార్డింగు చక్కగా వున్నవి- వినయఛటర్జీ నవల ననుసరించి తయారైన చిత్రమిది-